

ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 40.5 | కనిష్ఠం : 36.0

పేలిన సిలిండర్

చిన్నచింతకుంట, ఏప్రిల్ 11: మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం ఉంద్యాల గ్రామంలో గురువారం ఓ ఇంట్లో ప్రమాదవశాత్తు సిలిండర్ పేలింది. ఈ ఘటనలో ప్రాణనష్టం వాటిల్లలేదు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నాగరాజు పూరిగుడిసెలో ఉంటున్నాడు. షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసెలోని విద్యుత్ తీగల నుంచి మంటలు చెలరేగాయి. దాంతో గుడిసెలో ఉన్న సిలిండర్ ఒక్కసారిగా పేలింది. భారీ శబ్దం రావడంతో సమీపంలోని వారు పరుగులు తీశారు. గుడిసెలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. ఆస్తి నష్టం వాటిల్లిందని చెప్పారు.

భక్తి శ్రద్ధలతో.. రంజాన్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రంజాన్ పండుగను ముస్లింలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మతసామరస్యానికి ప్రతీకగా హిందువులు ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కొల్లాపూర్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్‌లో ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, కల్వకుర్తిలో ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, అచ్చంపేటలో ఎమ్మెల్యే వంశీకృష్ణ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, మహబూబ్‌నగర్‌లో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, పార్లమెంట్ అభ్యర్థులు డీకే అరుణ, చల్లా వంశీచంద్‌రెడ్డి వానగుట్ట ఈద్గా వద్ద ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. - ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్



నాగర్‌కర్నూల్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



కొల్లాపూర్‌లో ఈద్గా వద్ద ముస్లిం మత గురువు హఫీజ్ హాశీం సుల్తారిని సన్మానించి రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు



నమాజ్ చేస్తున్న చిన్నారి



ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ



ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



నాగర్‌కర్నూల్‌లో ఈద్గా వద్ద ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

పసిడి రికార్డు ధర



- తులం రూ.74,400..
- కిలో వెండి ధర రూ.86,500
- బెంబేలెత్తుతున్న కొనుగోలుదారులు



నారాయణపేట, ఏప్రిల్ 11: పసిడి ధరలు పరుగులు తీస్తున్నాయి. ఎన్నడూ లేని విధంగా బంగారం, వెండి ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. బంగారం తులం(పది గ్రాములు) ధర గురువారం రూ.74,400లకు చేరుకోగా, కిలో వెండి రూ.86,500 చేరుకుంది. రెండు రోజుల క్రితం తులం బంగారం ధర రూ.74,200 ఉండగా, కిలో వెండి ధర రూ. 86,000 పలికింది. గత సోమవారం తులం బంగారం ధర రూ.73,800 పలుకగా, కిలో వెండి రూ.86,000 పలికింది. అదే రోజు ఉదయం, మధ్యాహ్నం మూడు సార్లు ధరలు హెచ్చు తగ్గులు అయ్యాయి. రోజు రోజుకు ధరల పెరుగులతో కొనుగోలుదారులకు ఆర్థిక భారంగా మారింది. ఇది పెళ్లిళ్ల సీజన్ కావడంతో వివాహాలు చేసే వారు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ ధరలకు బంగారం కొనలేమని సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

80 వేలకు చేరుకునే అవకాశం



పసిడి ధరలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. రష్యా, ఉక్రెయిన్, ఇజ్రాయేల్‌లలో యుద్ధాల ప్రభావం, కరెన్సీ విలువ హెచ్చుతగ్గులతో బంగారం ధరలు పెరుగుదలపై తీవ్ర ప్రభావం పడుతోంది. తులం బంగారం ధర 80 వేలకు చేరుకునే అవకాశం ఉందనే ఊహాగానాలు వస్తున్నాయి. దాంతో ఆర్థికంగా ఉన్న వారు ఇప్పుడే కొనుగోలు చేస్తున్నారు. బంగారు ధరలతో పెళ్లిళ్లకు 10 తులాలు తీసుకునే వారు ఎనిమిది తులాలకే పరిమితమవుతున్నారు.

- హరినారాయణ్ భట్టడ్, బులియన్ మర్చంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నారాయణపేట

బంగారం కొనలేం



పెరుగుతున్న బంగారం ధరలు సామాన్య, మధ్య తరగతి ప్రజలకు భారంగా మారుతున్నాయి. ధరలు ఇలా పెరిగితే మేం కొనలేం. రెండు గ్రాములు కొనే చోట గ్రాముకే పరిమితం కావాల్సి వస్తుంది. ఈ ధరల పెరుగుదల వల్ల చాలా మంది రోల్డ్ గోల్డ్ ఆభరణాలపై మక్కువ చూపుతున్నారు.

- లక్ష్మి, గృహిణి, నారాయణపేట

పని చేయకుండానే జీతాలు

- నిరుపయోగంగా మహబూబ్‌నగర్‌లోని లెప్రసీ వార్డు
- అవసరం లేకున్నా 10 మందికి పోస్టింగ్
- యూనియన్ పేరుతో ఏడేళ్లుగా వార్డును వదలని ఓ ల్యాబ్ టెక్నీషియన్
- ఇష్టం వచ్చినప్పుడు వచ్చి సంతకాలు

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) ఏప్రిల్ 11: కుష్టు రోగులకు వైద్య సేవలు అందించేందుకు మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన టీహెచ్‌డబ్ల్యూ(టోటల్ హాస్పిటలైజేషన్ వార్డు) గత కొన్నేళ్లుగా నిరుపయోగంగా మారింది. కొందరి స్వార్థంతో కేవలం పోస్టింగులు, డిప్యుటేషన్ల కోసమే ఆ వార్డును కొనసాగిస్తున్నారు. అవసరం లేకున్నా 10 మందికి అందులో పోస్టింగ్ ఇవ్వగా.. వారు తమకు అనుకూలమైన ప్రాంతాల్లో డిప్యూటేషన్‌పై పని చేస్తున్నారు. 1980లలో కుష్టు వ్యాధి విపరీతంగా ఉండడంతో వ్యాధిగ్రస్థుల గాయాలకు డ్రెస్సింగ్ చేసి, మందులు ఇచ్చేందుకు అప్పటి జిల్లా ఆస్పత్రి ఆవరణలో ప్రభుత్వం టీహెచ్‌డబ్ల్యూ వార్డును ఏర్పాటు చేసింది. రోగులు ఉండేందుకు 10 మంచాలు సిద్ధం చేసింది. ఆ వార్డుకు ఒక మెడికల్ ఆఫీసర్, ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఒక ఫిజియోథెరపిస్టు, మరో ఇద్దరు నాల్గో తరగతి ఉద్యోగుల పోస్టులను మంజూరు చేసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ వార్డు కొనసాగుతుంది.



జనరల్ ఆస్పత్రి ఆవరణలో ఉన్న టీహెచ్‌డబ్ల్యూ వార్డు

పేరుకే వార్డు..

వార్డులో ప్రస్తుతం మందులు, డ్రెస్సింగ్ చేసే పరికరాలు లేవు. ఫిజియోథెరపి, ల్యాబ్‌కు సంబంధించిన ఏ ఒక్క పరికరమూ లేదు. మంచాలు విరిగిపోగా, బెడ్లు చిరిగిపోయాయి. వార్డు పూర్తిగా శిథిలావస్థకు చేరింది. బెంచీలు, కుర్చీలు పాత కాలం నాటివి కావడంతో ఓ మూలకు పడేశారు. మూత్రశాలలు, తాగునీటి సౌకర్యం కూడా లేదు. అయినా అక్కడ మాత్రం 10 మంది వైద్య సిబ్బంది పని చేస్తుండటం విశేషం. ఈ వార్డును జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ 108 సిబ్బందికి అప్పగించారు.

ఒక్కరు తప్ప అంతా డిప్యుటేషన్

టీహెచ్‌డబ్ల్యూ వార్డులో 10 మందికిగాను ఒక ఫిజియోథెరపిస్టు, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక స్వీపర్ పని చేస్తున్నట్లు రిజిస్టర్‌లో సంతకాలు ఉన్నాయి. కానీ ఇక్కడ పనిచేసేది ఒక్క ఫిజియోథెరపిస్టే. ల్యాబ్ టెక్నీషియన్, స్వీపర్ పని చేయకపోగా.. వారికి ఇష్టం వచ్చినపుడు వచ్చి సంతకాలు చేసి వెళ్తున్నారు. మిగతా వారిలో ఒకరు ఏనుగొండ, ఒకరు వీరన్నపేట బస్తీదవఖానలో, మరొకరు హన్వాడ పీహెచ్‌సీలో, నలుగురు డీఎంఅండ్ హెచ్‌వో కార్యాలయంలో డిప్యూటేషన్‌పై పని చేస్తున్నారు.

ఏళ్లుగా వార్డును వదలని ఆ ఇద్దరు..

ఈ వార్డులో 10 పోస్టులు ఉండడంతో ఆ పోస్టుల్లోకి రావడానికి ప్రతీ ఒక్కరు ఆసక్తి చూపుతారు. ఎందుకంటే అక్కడ ఏమాత్రం పని ఉండదు. వచ్చినా.. రాకపోయినా అడిగే వారు ఉండరు. దీంతో గత కొన్నేళ్లుగా ఇద్దరు ఉద్యోగులు ఆ పోస్టులను వదలడం లేదు. ఒక వైద్యాధికారి ఏకంగా ఆ వార్డుకు 13 ఏళ్లుగా ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. అంతేకాకుండా ఓ ల్యాబ్ టెక్నీషియన్ ఏడేళ్లుగా ఆ వార్డులో డిప్యూటేషన్‌పై పని చేస్తున్నాడు. అక్కడ రోగులు ఉండరని అందరికి తెలిసినప్పటికీ జిల్లా ఉన్నతాధికారులు ఆయనకు డిప్యుటేషన్ ఎలా ఇచ్చారో వారే చెప్పాలి. బీఆర్ఎస్‌కు అనుబంధ సంస్థగా యూనియన్‌ను అడ్డం పెట్టుకొని, నాయకుడిగా చెలామణి అవుతూ ఏడేళ్లుగా అక్కడే కొనసాగుతున్నాడు. సాధారణ బదిలీలు జరిగినా, డిప్యూటేషన్లు రద్దు చేసినా ఆ ల్యాబ్ టెక్నీషియన్ మాత్రం ఆ వార్డుకే తిరిగి పోస్టింగ్ తెచ్చుకుంటాడు. ఇన్నేళ్ల సర్వీసులో ఆయన ఒక్క టెస్టు కూడా చేయకపోవడం గమనార్హం.

ప్రతిపాదనలన్నీ బుట్టదాఖలు..

టీహెచ్‌డబ్ల్యూ వార్డు వలన ఎలాంటి ఉపయోగం లేదని భావించిన ప్రభుత్వం దానిని జనరల్ ఆస్పత్రిలో కలపాలని, ఆ పోస్టులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేయాలని నిర్ణయించింది. అందుకు ప్రతిపాదనలు రూపొందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి ఆదేశాలు జారీ చేసింది. కానీ కొందరి స్వార్థం కోసం.. ఆ ఉత్తర్వు కాపీలను మాయం చేశారు. ఆ వార్డు వలన ఎలాంటి ప్రయోజనం లేదు. ఉద్యోగులను ఖాళీగా కూర్చోబెట్టి వేతనాలు ఇస్తున్నారు. కలెక్టర్ స్పందించి ఓ నిర్ణయం తీసుకుంటే ప్రజాధనం వృథా కాకుండా ఉంటుంది.

జనరల్ ఆస్పత్రిలో విలీనం చేస్తాం..

టీహెచ్‌డబ్ల్యూ వార్డును జనరల్ ఆస్పత్రిలో విలీనం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ విషయమై ప్రభుత్వం నుంచి త్వరలో ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉంది. అక్కడ అక్రమంగా పని చేస్తున్న వారి డిప్యుటేషన్లు రద్దు చేస్తాం. టీహెచ్‌డబ్ల్యూ వార్డు దుస్థితిపై కలెక్టర్‌కు నివేదించి, ఆయన ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ కృష్ణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

ఎండుతున్న మొక్కలు

- గత ప్రభుత్వం ఇచ్చిన నాసిరకం విత్తనాలే కారణం?
- హరితహారంపై నీలినీడలు



కలుగొట్ల గ్రామంలో ఎండిపోతున్న మొక్కలు

అలంపూర్ చౌరస్తా, ఏప్రిల్ 11: గత ప్రభుత్వం హరితహారం పథకంలో భాగంగా నర్సరీల్లో పెంచిన మొక్కలు ఎండిపోతున్నాయి. రాశి ఫలాల ప్రకారం మొక్కలు పంచుతామని, ప్రతీ మొక్కకు జియోట్యాగింగ్ ఏర్పాటు చేస్తామని, ఊర్లను ప్రకృతివనాలుగా మార్చుతామన్న మాటలు క్షేత్ర స్థాయిలో అమలుకు నోచుకోలేదు. ఏటా నాయకులు మొక్కలు నాటుతుండగా, మరుసటి ఏడాదికి అవి ఎండటం పరిపాటిగా మారింది. కొత్తగా వచ్చిన ప్రభుత్వమైనా పథకం లక్ష్యం నెరవేరుతుందేమో చూడాలి.

ఆదిలోనే..

హరితహారంలో భాగంగా నాటేందుకు మొక్కలు పెంచడం కోసం గత ప్రభుత్వం కానుగ, గుల్మోహర, సీమ తంగెడి, దర్శినం, రెయిన్‌ట్రీ, చింత, వేప, బొప్పాయి, సీతాఫలం, ఖర్జూర, జామ, మునగ, బాదం, ఉసిరి, నేరేడు, కుంకుడు, టేల్లోపాం, వెదురు, సుబాబుల్, నెమలి, రావి, మందారం, టెకోమా, గన్నేరు తదితర విత్తనాలను వన సేవకులకు అందజేసింది. ఊరికి కనీసం పదివేల మొక్కలకు సరిపడ పలు రకాల విత్తనాలు సరఫరా చేయాల్సి ఉండగా.. ఆరు వేల నుంచి ఏడు వేల వరకే అందించారు. ఇచ్చిన విత్తనాలను సైతం శుద్ధి చేయకపోవడం, వన సేవకులకు సరైన అవగాహన కల్పించకపోవడం, విత్తనాలు నాటేందుకు అనువైన మట్టి సేకరించకపోవడంతో దాదాపు అన్ని గ్రామాల్లో 60 శాతం మేర విత్తనాలు మొలకెత్త లేదు. మొక్కలకు ఎండ నుంచి రక్షణ కోసం అందజేసిన టార్పాలిన్లు చాలా చోట్ల పక్కన పెట్టారు. కొన్ని చోట్ల ఈదురు గాలులకు చిరిగిపోయాయి. దీంతో ఎండ తీవ్రత, కొన్ని చోట్ల ఫ్లోరైడ్ నీటి కారణంగా విత్తనం ఆదిలోనే మురిగిపోయింది. మరికొన్ని చోట్ల వేరుకుళ్లు సోకడంతో మొలకశాతం గణనీయంగా తగ్గింది. మొలకెత్తని నర్సరీలకు విత్తనాలు మళ్లీ పంపుతామని అధికారులు చెబుతున్నా ఇంకా కార్యరూపం దాల్చలేదు. ఉండవల్లి మండలం బొంకూరులో పది వేల మొక్కల లక్ష్యంగా విత్తనాలిచ్చారు. అందులో సుమారు నాలుగువేల మొక్కలే మొలిచాయి. ఇదే మండలంలోని మెన్నిపాడులో సరైన సమయంలో విత్తనాలు నాటి, నీరు పడుతున్నా మొలకశాతం రావడం లేదని వనసేవకుడు, మాజీ సర్పంచు బజారన్న తెలిపారు.

లక్ష్యం ఘనం

జోగుళాంబ జిల్లాలో 255 గ్రామాలు ఉన్నాయి. డీఆర్‌డీఏ శాఖ ఆధ్వర్యంలో గతేడాది జిల్లా వ్యాప్తంగా 10 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం పెట్టుకొని, సుమారు ఎనిమిది లక్షల మొక్కలు నాటినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఈ ఏడాది గ్రామానికి కనీసం 3,200 నుంచి 5,000 మొక్కలు నాటాలని అధికారులు ఆదేశించారు. ఈ లెక్కన జిల్లా వ్యాప్తంగా సుమారు 10 లక్షల మొక్కలు నాటాల్సి ఉంది. ఇక ఫారెస్ట్ శాఖ ఆధ్వర్యంలో గతేడాది జిల్లా వ్యాప్తంగా 14 లక్షల మొక్కలు నాటగా, ఈ ఏడాది ఆరు లక్షల మొక్కలు నాటేందుకు సిద్ధమౌతున్నారు. మునిసిపాలిటీల్లో అయిజలో 40 వేల మొక్కలు నాటగా, ఈ సారి 30 వేలకుపైగా మొక్కలు నాటేందుకు విత్తనాలు వేశారు. అలంపూర్ మునిసిపాలిటీలో గతేడాదిలో 37,800 మొక్కలు నాటినట్లు అధికారిక లెక్కలు చెబుతుండగా, ఈ ఏడు 36,801 మొక్కలు, వడ్డేపల్లిలో గతేడాది 23,080 మొక్కలు నాటగా ఈ సారి 24,339 మొక్కలు నాటేందుకు సిద్ధం చేస్తున్నారు. గతేడాది ఇచ్చిన టార్గెట్‌లో గ్రామాల్లో రెండువేల మొక్కలకు మించి నాటలేదని క్షేత్ర స్థాయిలో చూస్తే అర్థమవుతోంది. నర్సరీలో ఒక మొక్క పెంచడానికి నెలకు రూ.3.80లు, దానిని నాటడానికి గుంత తీసేందుకు రూ.29.29, నాటిన తర్వాత కలుపుతీత, నీరందించడం, రక్షణ ఏర్పాటు చేయడం కోసం నెలకు రూ.17.83 ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. ఈ లెక్కన ప్రతీ గ్రామానికి నెలకు సుమారు రూ.1.70 లక్షల మేర ఖర్చవుతోంది.

బిల్లుల చెల్లింపులో జాప్యం..

జిల్లాలో ఎక్కువ శాతం నర్సరీలను రైతుల పొలాల్లోనే ఏర్పాటు చేశారు. ఇందు కోసం ఏరియాను బట్టి ప్రభుత్వమే అద్దె చెల్లిస్తూ వస్తోంది. మొక్కల నిర్వహణ కోసం వన సేవకులను ఏర్పాటు చేసింది. వారికి రోజువారి కూలీలో భాగంగా మస్టర్ ప్రకారం ప్రతీ వారం చెల్లించాలి. వనసేవకులకు, భూ యజమానులకు గతేడాది డిసెంబరు నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో నర్సరీల నిర్వహణలో వన సేవకులు ఆసక్తి చూపడం లేదు.

పట్టపగలు చోరీ

- సోలీపూర్‌లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై దాడి
- మెడలో గొలుసు లాక్కున్న ఇద్దరు మహిళలు
- చేతి బంగారు గాజులు రాకపోవడంతో కత్తితో గాయం
- పారిపోతుండగా పట్టుకున్న స్థానికులు
- దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత

ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 11: వనపర్తి జిల్లా ఖిల్లా ఘణపురం మండలంలోని సోలీపూర్ గ్రామంలో గురువారం పట్ట పగలు ఇద్దరు మహిళలు ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. గ్రామంలోని సంత బజార్ రోడ్డులో ఉన్న గిన్నె పురేందర్ రెడ్డి కుటుంబ సభ్యులు వ్యవసాయ పనులకు వెళ్లారు. ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న పురేందర్‌రెడ్డి తల్లి వృద్ధురాలు లక్ష్మీదేవమ్మను మధ్యాహ్న సమయంలో వచ్చిన ఇద్దరు మహిళలు మంచి నీళ్ల కావాలని అడిగారు. ఆమె వంట గదిలోకి నీళ్ల తేవడానికి వెళ్లగా ఇద్దరు మహిళలు వెనుక నుంచి వృద్ధురాలిపై దాడి చేసి, మెడలో ఉన్న బంగారం గొలుసును కత్తిరించారు. అనంతరం చేతికి ఉన్న గాజులు తీయడానికి రాకపోవడంతో కత్తితో కోయడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో లక్ష్మీదేవమ్మ కుడి చేతిపై గాయమై, రక్తస్రావం అయ్యింది. తర్వాత వారు గొలుసు తీసుకుని వెళ్లిపోయారు. ఎండా కాలం కావడం, రోడ్డుపై జన సంచారం లేనందున మహిళా దర్జాగా వెళ్లారు. వారు వెళ్లాక ఇంట్లోంచి బయటకు వచ్చిన లక్ష్మీదేవమ్మ దొంగ దొంగ అని అరవడంతో లక్ష్మీకాంత్ రెడ్డి, చాంద్ బి వెంటాడి, మహిళా దొంగలను పట్టుకున్నారు. తర్వాత వారికి స్థానికులు దేహశుద్ధి చేసి, గొలుసును రికవరీ చేసుకుని లక్ష్మీదేవమ్మకు ఇచ్చారు. అనంతరం దొంగలను పోలీసులకు అప్పగించారు. పట్టుబడిన దొంగలు గ్రామంలో రెండు రోజులు బిచ్చగాళ్లుగా ఇంటింటికి తిరిగి రెక్కీ నిర్వహించారని గ్రామస్థులు తెలిపారు.





పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

పోలీసుల అదుపులో నిందితులు

ఎస్ఐ శ్రీహరి సోలీపూర్‌కు వెళ్లి చోరీకి పాల్పడిన దొంగలను అదుపులోకి తీసుకున్నారు. దొంగతనానికి పాల్పడిన వారిని వనపర్తికి చెందిన బుర్రమ్మ, లక్ష్మిగా గుర్తించారు. లక్ష్మీదేవమ్మ మెడలోని గొలుసును దొంగిలించి, గాజుల కోసం కుడి చేతిపై కత్తితో దాడి చేసినట్లు చెప్పారు. సీఐ రాంబాబు కూడా సోలీపూర్‌కు వచ్చి, సంఘటన వివరాలను సేకరించారు.

అడుగంటుతున్న భూగర్భ జలాలు

- పాలమూరులో ప్రమాద ఘంటికలు
- గతేడాది మార్చితో పోలిస్తే 3.46 మీటర్ల లోతుకు గంగ
- అన్నదాతకు తప్పని తిప్పలు


వ్యవసాయ పొలంలో ఆగి ఆగి వస్తున్న నీరు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 11 : పాలమూరులో భూగర్భజలాలు రోజురోజుకు అడుగంటుతున్నాయి. ప్రస్తుత పరిస్థితి ఇలానే కొనసాగితే గతంలో నెలకొన్న పరిస్థితులు మళ్లీ పునరావృతమయ్యే ప్రమాదం పొంచి ఉన్నట్లు స్పష్టమవుతోంది. నాలుగేళ్ల క్రితం భూగర్భ జలాలు 10 మీటర్ల కన్నా ఎక్కువ లోతుకు వెళ్లగా ప్రస్తుతం జిల్లాలో 11.43 మీటర్ల లోతుకు నీరు వెళ్లిపోయింది. 2020 తరువాత ఈ స్థాయిలో లోతుకు నీరు వెళ్లడం ఇదే తొలిసారి. గతేడాది మార్చిలో 7.97 మీ. లోతులో నీరుండగా ప్రస్తుతం గతేడాదికి అదనంగా మరో 3.46 మీ. లోతుకు నీరు వెళ్లిపోవడంతో బోర్లలో నీటిమట్టం తగ్గిపోతోంది.

ఎండుతున్న పంటలు

రైతులు యాసంగిలో ఎక్కువగా బోర్లపై ఆధారపడి వ్యవసాయం చేస్తారు. గతేడాది వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నిరుడు బోరు కింద రెండెకరాలు వరి సాగు చేసిన రైతు ఈసారి ఎకరంన్నర, ఎకరాలోపే సాగు చేశాడు. అందుకే గతేడాదికన్నా జిల్లాలో వరిసాగు విస్తీర్ణం తగ్గిపోయింది. 2023 యాసంగిలో 1.46 లక్షల ఎకరాల్లో వరిసాగు చేయగా, ప్రస్తుతం 1.28 లక్షల ఎకరాలు మాత్రమే సాగుచేశారు. అయినా భూగర్భజలాలు అడుగంటడంతో ఉన్న బోర్లలో నీరు చాలావరకు తగ్గిపోవడంతో సాగుచేసిన పంటలకు నీరు సరిపోవడం లేదు. రెండు ఎకరాలు పారే బోరు ఎకరా అయినా పారుతుందన్న ఆశతో సాగుచేసినా ఎకరా పొలానికి కూడా నీరందకపోవడంతో భూగర్భజలాలు ఏవిధంగా పడిపోయాయో అర్థమవుతోంది. చాలా బోర్లు ఆగిఆగి నీరు పోస్తుండటంతో తడిసిన చోటనే మళ్లీ మళ్లీ తడవడం వల్ల పంట ఎండిపోవడానికి కారణమవుతోంది. ఉన్నట్టుండి బోర్లలో నీరు ఒక్కసారిగా తగ్గిపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. బోర్లను నమ్ముకుని వరిసాగు చేసిన రైతులకు కష్టాలు తప్పడం లేదు. పంట ఎండిపోవడం చూసి తట్టుకోలేక రైతులు ఇష్టానుసారంగా బోర్లు వేస్తున్నారు. చాలాచోట్ల నీళ్లు పడక ఇటు పంట ఎండిపోయి, అటు బోరుకు పెట్టిన ఖర్చు అన్నదాతకు అదనపు భారంగా మారింది.

ఇంకుడుగుంతలు తప్పనిసరి చేయాలని నిర్ణయం

వర్షాభావ పరిస్థితులతో భూగర్భజలాలు అడుగంటుతుండటంతో ప్రభుత్వం వర్షపునీటిని ఒడిసి పట్టుకునేందుకు ఇళ్ల ముందు, ప్రభుత్వ కార్యాలయాల ముందు ఇంకుడుగుంతలు కచ్చితంగా నిర్మించి తీరాలని చెబుతుంది. ఇప్పటికే పురపాలిక అధికారులకు సర్క్యులర్ జారీ చేసి ఇప్పటికే నిర్మాణంలో ఉన్న ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు ఉన్నాయో? లేదో సర్వే చేయాలని చెప్పడంతో అధికార యంత్రాంగం ఇంటింటికి తిరిగి సర్వే చేస్తున్నారు. జిల్లాలోని అన్ని మునిసిపాలిటీలలో అధికారులు సర్వే బృందాలను నియమించి ఇంటింటికి తిప్పి ఎన్ని ఇళ్లకు ఇంకుడు గుంతలు ఉన్నాయి. లేనివాటి ఇళ్ల వివరాలను సేకరిస్తున్నారు. వర్షం పడ్డపుడు వర్షపు నీటిని పైపు ద్వారా ఇంకుడు గుంతలోకి నీటిని మళ్లించడం వల్ల భూగర్భజలాలు పెరుగుతాయని ఇకపై ఇంటి నిర్మాణంలో కచ్చితంగా ఇంకుడు గుంత నిర్మించాలని, ఇదివరకు ఇళ్లను నిర్మించుకున్న వారికి వీటి అవశ్యకతపై అవగాహన కల్పించాలని నిర్ణయించారు. అందుకే పుర అధికారులు పట్టణంలో ఇంటింటికి తిరిగి ఇంకుడు గుంతల నిర్మాణానికి లోకేషన్ ఇచ్చి జియో ట్యాగింగ్ చేస్తున్నారు. భూగర్భ జలాలను పెంచుకునే చర్యలు తీసుకోకపోతే భవిష్యత్‌లో తాగునీటి కోసం ఇబ్బంది పడాల్సిన పరిస్థితి రాబోతుందని, అందుకే ప్రతీ ఒక్కరు ఇళ్ల ముందు ఇంకుడు గుంతలు కచ్చితంగా నిర్మించుకోవాలని అధికారులు పెద్దఎత్తున ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేస్తున్నారు. ప్రజలు కూడా బాధ్యతగా తీసుకుని ఇంకుడుగుంతల నిర్మాణాలకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

తాగునీటి సరఫరాకు

ప్రత్యేక కార్యాచరణ

- రూ.1.89 కోట్లతో పీడబ్ల్యూఎస్ పథకాలకు మరమ్మతులు
- ఆరెంజ్, ఎల్లో జోన్‌లపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి

గద్వాల, ఏప్రిల్ 11 : వేసవిలో తాగునీటి సరఫరాపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టారు. జూరాల జలాశయంలో వేగంగా నీటి నిల్వలు పడిపోతుండటం ఈనెల 30వ తేదీ వరకే మిషన్ భగీరథకు నీరందే అవకాశం ఉండ టంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు ప్రణాళికలను సిద్ధం చేశారు. ఇప్పటికే గ్రామాల్లోని పీడబ్ల్యూఎస్ పథకాలకు మరమ్మతులు ప్రారంభించారు. ఇందుకోసం ప్రభుత్వం జిల్లాకు రూ.1.89 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో 443 బోర్లు, 302 మోటార్లకు మరమ్మతు చేపట్టారు. ఇప్పటికే మిషన్ భగీరథ నీటి సరఫరాలో తగ్గుదల ఉండటంతో, ఈ పీడబ్ల్యూఎస్ పథకాల ద్వారా నీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేలా అధికారులు ప్రణాళికలను రూపొందించారు.

నిధులు విడుదల చేసిన ప్రభుత్వం

నీటి ఎద్దడిని నివారించేందుకు ప్రభుత్వం జిల్లాకు రూ.1.89 కోట్ల నిధులను విడుదల చేసింది. వీటిని ఎలా ఖర్చు చేయాలో తాగునీటి సరఫరా అధికారులు సర్వే చేసి ప్రణాళికను సిద్ధం చేశారు. గద్వాల నియోజకవర్గంలోని 57 గ్రామాలకు రూ.67.55 లక్షలు కేటాయించారు. గద్వాలకు రూ.25.75లక్షలు, ధరూర్‌కు రూ.10 లక్షలు, గట్టుకు రూ.14.30 లక్షలు, మల్దకల్‌కు రూ.10.50 లక్షలు, కేటీదొడ్డికి రూ.7 లక్షలను కేటాయించారు. అలంపూర్ నియోజకవర్గంలోని 61 గ్రామాలకు రూ.1.21 కోట్లను కేటాయించారు. అందులో అయిజకు రూ.36.80 లక్షలు, ఇటిక్యాలకు రూ.33.55 లక్షలు, అలంపూర్‌కు రూ.6.80 లక్షలు, మానవపాడుకు రూ.14 లక్షలు, రాజోలికి రూ.7 లక్షలు, ఉండవెల్లికి రూ.14.35 లక్షలు, వడ్డేపల్లికి రూ.9.10 లక్షలు కేటాయించారు.

మరమ్మతు పనులు ఇలా..

జిల్లాలో పీడబ్ల్యూఎస్ పథకంలో 443 బోర్లు, 302 మోటార్లు ఉన్నాయి. 2018 నుంచి మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా అవుతుండటంతో వీటి వినియోగం తగ్గిపోయింది. దీంతో చాలావరకు బోర్లు, మోటార్లు పనిచేయడం లేదు. ఇప్పుడు నీటి ఎద్దడి తలెత్తుతుండటంతో వీటిని పునరుద్ధరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. అందుకు రూ.1.89 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇందులో రూ.22.10 లక్షలతో 79 మోటార్ల మరమ్మతు, రూ.11.60 లక్షలతో 116 బోర్లను ఫ్లషింగ్ చేయనున్నారు. 37 చేతి పంపులను వినియోగంలోకి తెచ్చేందుకు రూ.5.80 లక్షలు కేటాయించారు. రూ.58.65 లక్షలతో పాత మోటార్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసేందుకు, రూ.2.80 లక్షలతో సింగిల్ ఫేస్ మోటార్ల మరమ్మతులకు కేటాయించారు. రూ.86.80 లక్షలను పైపులైన్ల ఏర్పాటు, మరమ్మతులకు కేటాయించారు. కేటీదొడ్డి మండలం పూజారితండా, ఉండవెల్లి మండలం ప్రాగటూర్‌లో రూ.లక్ష వ్యయంతో ప్రైవేట్ బోర్లను అద్దెకు తీసుకోవాలని నిర్ణయించారు.

ఆరెంజ్ జోన్‌లో 84 గ్రామాలు

జిల్లాలో మొత్తం 313 గ్రామాలు ఉండగా, దీవి గ్రామం గుర్రంగడ్డకు మంచినీటి పథకాలు లేవు. మిగిలిన 312 గ్రామాలకు గాను 213 గ్రామాల్లో ప్రస్తుతం నీటి ఎద్దడి లేదు. ఇవి గ్రీన్ జోన్‌లో ఉన్నాయి. 84 గ్రామాల్లో నీటి ఎద్దడి ఉండగా ఇవి ఆరెంజ్ జోన్‌లో ఉన్నాయి. మరో 15 గ్రామాల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉండగా ఈ గ్రామాలు ఎల్లో జోన్ కింద ఉన్నాయి. ప్రస్తుతానికి రెడ్ జోన్‌లో ఏ గ్రామాలు లేవు. కానీ జిల్లాలో భూగర్భజలం వేగంగా పడిపోతున్నది. ఇప్పటికే పుల్లూరు, కంచుపాడు, మార్లబీడు, మునగాల, ర్యాలంపాడు, చింతలకుంట తదితర గ్రామాల్లో భూగర్భ జలం 22 నుంచి 28 మీటర్ల లోతుకు చేరింది. దీంతో మే నెల నాటికి మరింత లోతుకు చేరి, కొన్ని గ్రామాలు రెడ్‌జోన్‌లో చేరే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో నీటి ఎద్దడి ఉన్న గ్రామాలపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రతీరోజు మూడు గ్రామాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.



లత్తీపురంలో మోటారు మరమ్మతు కోసం పైపులైన్‌ను బయటకు తీస్తున్న మెకానిక్



గుంటిపల్లిలో మోటార్లను బిగించి సిద్ధం చేస్తున్న పీడబ్ల్యూఎస్ పథకం బోర్లు

కర్ణాటక నుంచి నీరు వస్తే..

తాగునీటి ఎద్దడిపై కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి శ్రుతి ఓఝా, కలెక్టర్ బీఎం సంతోష్ ఇటీవల సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుతానికి జిల్లాలో నీటి ఎద్దడి లేదని అన్నారు. వచ్చేనెల 15వ తేదీ వరకు మిషన్ భగీరథ నీరు అందించగలుగుతామని తెలిపారు. ప్రత్యామ్నాయంగా పీడబ్ల్యూఎస్ పథకాలను సిద్ధం చేశామని చెప్పారు. కర్ణాటక ప్రాజెక్టుల నుంచి మూడు టీఎంసీల నీటిని విడుదల చేస్తే వేసవి గట్టెక్కుతుందని వివరించారు.

సామాజిక దార్శనికుడు మహాత్మా ఫూలే

- మంత్రి జూపల్లి కృష్ణారావు



కొల్లాపూర్‌లో పూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మంత్రి జూపల్లి

కొల్లాపూర్, ఏప్రిల్ 11: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన సామాజిక దార్శనికుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం కొల్లాపూర్ పట్టణంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన పూలే జయంతి వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. పూలే చిత్రపటానికి మంత్రి పుష్పాంజలి ఘటించి నివాళులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అంటరానితనం, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

దొంగతనం జరిగిన దుకాణాల పరిశీలన

- షాపుల యజమానులతో మాట్లాడిన చిన్నారెడ్డి



దుకాణాలను పరిశీలిస్తూ యజమానులతో మాట్లాడుతున్న చిన్నారెడ్డి

పెబ్బేరు, ఏప్రిల్ 11 : వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలో వరుస దొంగతనాలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్న తరుణంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి గురువారం సాయంత్రం చోరీ జరిగిన దుకాణాలను పరిశీలించి, యజమానులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాపు యజమానులకు భరోసాను కల్పిస్తూ ధైర్యంగా ఉండాలని, విలువైన వస్తువులు షాపులో కాకుండా తమ ఇళ్లల్లో భద్రపరుచుకోవాలని సూచించారు. దొంగలను వెంటనే పట్టుకునే విధంగా పోలీసులతో మాట్లాడుతానని తెలిపి వెంటనే పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి స్టేషన్‌లోని సిబ్బంది, డైలీ రిజిస్టర్లు తదితర రికార్డులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ సంబంధిత రిజిస్టర్‌ను పరిశీలించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వనపర్తి నియోజకవర్గంలో పెద్ద పట్టణమైన పెబ్బేరులో ఇటువంటి సంఘటనలు తరచూ జరగడం పెబ్బేరు పోలీస్ వ్యవస్థకు తీవ్రని మచ్చ అని, ఈ వైఖరిని వీడి ప్రజలకు రక్షణ, భరోసా కల్పించాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. చిన్నారెడ్డి వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎం.రాజేంద్రప్రసాద్‌యాదవ్, మండల అధ్యక్షుడు ఎద్దుల విజయవర్ధన్‌రెడ్డి, కారపాకుల వెంకట్రాములుయాదవ్, శ్రీరంగాపురం మండల అధ్యక్షుడు రాములుయాదవ్, పెబ్బేరు పట్టణ నాయకులు ఉన్నారు.

నగదు పట్టివేత



నగదును పట్టుకున్న పోలీసులు

కృష్ణ, ఏప్రిల్ 11 : వాహనాల తనిఖీలో పోలీసులు ఓ వ్యక్తి నుంచి నగదును పట్టుకున్నారు. నారాయణపేట జిల్లా కృష్ణ బ్రిడ్జి చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా సింధనూరు గ్రామానికి చెందిన ప్రవీణ్‌గౌడ కారులో నిజామాబాద్ వెళ్తుండగా అతని వద్దనున్న రూ.98 వేల నగదును పట్టుకొని సీజ్ చేసినట్లు ఏఎస్సై సురేంద్ర బాబు తెలిపారు.

మద్యం స్వాధీనం

బాలానగర్, ఏప్రిల్ 11 : మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం నేరళ్లపల్లి గ్రామంలో పోలీసులు 19 లీటర్ల అక్రమ మద్యాన్ని పట్టుకున్నారు. గ్రామానికి చెందిన బంట రవి గ్రామంలో మద్యం విక్రయిస్తున్నాడని పోలీసులకందిన విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం దాడులు నిర్వహించారు. అతనివద్దనున్న 19 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపాజీ తెలిపారు.

చికిత్స పొందుతూ సివెట్ క్యాట్ మృతి

బిజినేపల్లి, ఏప్రిల్ 11 : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం గంగారం ఫారెస్టు సమీపంలోని భీమునితండాలో గుర్తు తెలియని జంతువుల దాడిలో గాయపడిన అరుదైన ఆసియన్ పాం సివెట్ క్యాట్ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఫారెస్టు రేంజ్ అధికారి పర్వేజ్‌అహ్మద్ గురువారం సాయంత్రం తెలిపారు. బుధవారం రక్త గాయాలతో అపస్మారక స్థితిలో ఉన్న సివెట్ క్యాట్‌ను ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ చంటి, బీట్ ఆఫీసర్ మోహన్‌లు సకాలంలో స్పందించి పశువైద్యాధికారిచే చికిత్స చేయించినా ఫలితం లేకపోయిందన్నారు.

యువతి అదృశ్యం, కేసు నమోదు

మిడ్జిల్, ఏప్రిల్ 11 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైంది. ఎస్సై చంద్రమోహన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యువతి ఈనెల ఏడో తేదీన మధ్యాహ్నం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లింది. బంధువులు, తెలిసిన వారి ఇళ్లల్లో తల్లిదండ్రులు వెతికినా ఎలాంటి ఫలితం లేకపోయింది. యువతి ఆచూకీ తెలియరాకపోవడంతో యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా, ఒక వ్యక్తిపై అనుమానం ఉన్నట్లు తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నాడని చెప్పారు.

సారా తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 11 : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం కల్వకోలు గ్రామ శివారులో సారా రవాణా చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ నాగిరెడ్డి తెలిపారు. గురువారం ఓ వ్యక్తి టీవీఎస్ ఎక్సెల్‌పై పది లీటర్ల సారాను రవాణా చేస్తుండగా కల్వకోలు గ్రామ శివారులో దాడులు నిర్వహించి సారాను స్వాధీనం చేసుకొని, బైక్ సీజ్ చేశామన్నారు. దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది మహేష్, నార్యానాయక్ ఉన్నారు.

రాహుల్ ప్రధాని సొల్లు మాట

- ప్రభుత్వం ఏదైనా మోదీ పథకమే
- బీజేపీ పాలమూరు ఎంపీ అభ్యర్థి డీకే అరుణ

నవాబ్‌పేట, ఏప్రిల్ 11 : కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రధాని అన్న మాట సొల్లు మాటేనని బీజేపీ పాలమూరు అభ్యర్థి డీకే అరుణ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అబద్ధపు ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వందరోజుల్లో ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదో ప్రజలకు చెప్పాలన్నారు. నిధులు లేవని, 17 సీట్లు గెలిచి రాహుల్ ప్రధాని అయితేనే హామీలు అమలు చేస్తామని చెప్పడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ అధ్యక్షురాలు పద్మజారెడ్డి, మండల అధ్యక్షుడు కారుకొండ రాజు, పస్పుల యాదయ్య, లోకిరేవు శ్రీనివాసులు, మున్నూర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



హన్వాడలో బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న డీకే అరుణ

హన్వాడలో బీజేపీలో పలువురి చేరిక

హన్వాడ : ప్రతీ బీజేపీ కార్యకర్త బూత్‌స్థాయిలో పనిచేయాలని, కచ్చితంగా బీజేపీ విజయం సాధిస్తుందని ఆ పార్టీ పాలమూరు ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. గురువారం హన్వాడలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీల పేరుతో మోసం చేసి అధికారంలోకి వచ్చిందని, ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో మరోసారి మోసం చేసేందుకు వస్తున్నారని ప్రజలు మళ్లీ మోసపోవద్దన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ వస్తేనే ఆరు గ్యారెంటీలు అమలవుతాయని చెప్పడం దారుణమన్నారు. దమ్ముంటే ఆరు గ్యారెంటీలను అమలు చేయాలన్నారు. ఫ్రీ బస్ పెట్టి సౌకర్యాలు మరిచిందన్నారు. తెలంగాణకు ప్రధానమంత్రి చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని, రామరాజ్యం తీసుకువద్దామని పేర్కొన్నారు. అనంతరం కొనగట్టుపల్లి, హన్వాడ, టంకర గ్రామాలకు చెందిన పలు పార్టీల కార్యకర్తలు డీకే అరుణ సమక్షంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా, గాయపడ్డ ఉపాధి హామీ కూలీలు

- నలుగురికి తీవ్ర గాయాలు
- 14 మందికి స్వల్ప గాయాలు
- క్షతగాత్రులకు అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స
- పరామర్శించిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే, సీపీఎం నాయకులు



క్షతగాత్రులను పరీక్షిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



పరామర్శిస్తున్న సీపీఎం నాయకులు

ఉప్పునుంతల, ఏప్రిల్ 11 : ట్రాక్టర్ బోల్తా పడి 18 మంది ఉపాధి హామీ కూలీలకు గాయాలైన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం కంసానిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై లెనిన్, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కలమండల లక్ష్మమ్మ, కృష్ణవేణి, మణెమ్మ, మాచర్ల పార్వతమ్మ, కాంపల్లి శంకరయ్య, కుందేటి చిన్న జంగయ్య, చిట్టెమ్మ, ఎల్లపాకుల లక్ష్మమ్మ, కాంపల్లి నిరంజనమ్మ, చింతల లక్ష్మమ్మ, మాచర్ల జంగమ్మ, కలమండల కిష్టమ్మ, ఎల్లపాకుల జ్యోతి, పుష్పలత, పాత్కుల వెంకటమ్మ, కొట్టె అలివేల, కలమండల పద్మ, మాచర్ల చంద్రయ్యలు గురువారం గ్రామ శివారులో ఉపాధి హామీ పనులకు వెళ్లారు. పనులు ముగించుకొని వస్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన కొట్టె ఆంజనేయులు ట్రాక్టర్ ట్రాలీలో పల్లురాయితో గ్రామానికి వెళ్తున్నాడు. ట్రాక్టర్‌ను ఆపిన కూలీలు 18 మంది ట్రాలీలో ఎక్కి కూర్చున్నారు. గ్రామ సమీపంలో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడడంతో మాచర్ల చంద్రయ్య, పార్వతమ్మ, కృష్ణవేణి, శంకరయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. మిగతా 14 మందికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆసుపత్రికి చేరుకొని క్షతగాతులకు ట్రీట్మెంట్ చేశారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఆయన సూచించారు. అదేవిధంగా, క్షతగాత్రులను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు దేశానాయక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చింత ఆంజనేయులు, సహాయ కార్యదర్శి నాగరాజు, కాంగ్రెస్ నాయకులు మోపతయ్య, నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ, రేణయ్య తదితరులు పరామర్శించారు. కలమండల పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సెలవు ఉన్నా పనులకు వెళ్లారు..

రంజాన్ పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించినప్పటికి ఈజీఎస్ అధికారులు నిర్లక్ష్యంగా గ్రామంలో ఉపాధి హామీ పనులు కొనసాగించినట్లు తెలిసింది. ఏపీవో సుదర్శన్‌గౌడ్‌ను వివరణ కోరగా.. రంజాన్ ముస్లింల పండుగ కాబట్టి మిగతా మతాల వాళ్లు పనులకు వెళతాం అంటే వెళ్లమని చెప్పాం అని అన్నారు.



ఘటనా స్థలి వద్ద క్షతగాత్రులను బయటికి తీస్తున్న గ్రామస్థులు

మహిళ ఆత్మహత్య

ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 11 : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం తిరుమలాయపల్లి గ్రామ శివారులోని వ్యవసాయ పొలంలో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై శ్రీహరి తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం మద్దిగట్ల గ్రామానికి చెందిన పావని(21)కి రెండు సంవత్సరాల క్రితం అదే గ్రామానికి చెందిన శ్రీకాంత్‌తో వివాహం జరిగింది. కొంతకాలంగా కడుపునొప్పి, తలనొప్పి, ఇతర అనారోగ్య సమస్యలతో ఆమె బాధపడుతోంది. అనారోగ్య సమస్యలతో గురువారం తిరుమలాయపల్లి గ్రామ శివారులోని తమ వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి ఎర్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. పావనికి ఒక సంవత్సరం బాలుడు తేజ్ సంతానంగా ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై చెప్పారు.

ట్రాక్టర్, బైక్ ఢీ, ఇద్దరు బాలురకు గాయాలు

రేవల్లి, ఏప్రిల్ 11 : వనపర్తి జిల్లా రేవల్లి మండలం చెన్నారం-గొల్లపల్లి మధ్యలో గల పెట్రోల్‌బంకు వద్ద ట్రాక్టర్, బైక్ ఢీకొని ఇద్దరు బాలురకు గాయాలయ్యాయి. ఎస్సై తిరుపతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు బాలురు అరవింద్(18), దీపక్(16) తాగునీటి కోసం గ్రామం నుంచి చెన్నారం గ్రామానికి వాటర్‌క్యాన్ తీసుకుని బైక్‌పై వెళ్తుండగా పెట్రోల్‌బంకు వద్ద పొలాల్లో నుంచి రోడ్డుపైకి ఎక్కుతున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో బైక్ అదుపు తప్పి ఇద్దరూ కింద పడ్డారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని చుట్టుపక్కల వారు చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. బాలురను ఢీకొట్టిన ట్రాక్టర్ చెన్నారం గ్రామానికి చెందిన డ్రైవర్ జంగం రాములుదేనని పోలీసులు గుర్తించారు. దీపక్ చిన్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రెండు బైకులు ఢీ, ఇద్దరికి..

పెబ్బేరు/వీపనగండ్ల, ఏప్రిల్ 11 : రెండు బైకులు ఢీకొని ఇరువురికి గాయాలైన సంఘటన గురువారం వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం తూముకుంట గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్సై దినకర్, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొర్లకుంట గ్రామానికి చెందిన మూడావత్ శంకర్ నాగర్లబండతండా నుంచి బైక్‌పై వెళ్తున్నాడు. అదేవిధంగా, తూముకుంట గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి పొలం పనులకు వెళ్తున్నాడు. తూముకుంట గ్రామ సమీపంలో ఎదురెదురుగా వచ్చిన బైక్‌లు ఢీకొన్నాయి. ప్రమాదంలో ఇద్దరికీ గాయాలు కావడంతో గ్రామస్థులు వారిని చికిత్స నిమిత్తం వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మూడావత్ శంకర్‌కు బలమైన గాయాలు కావడంతో హైదరాబాద్ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన చెప్పారు.

తాళాలు పగులగొట్టి నగదు, నగలు చోరీ

బిజినేపల్లి, ఏప్రిల్ 11 : ఉగాది పండుగకు అత్తారింటికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి చూసే సరికి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు, బీరువా తాళాలు పగలగొట్టి నగదు, నగలు దోచుకెళ్లిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం పాలెం గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దొంతనమోని మల్లేష్, భార్య శ్రీలతలు పిల్లలతో కలిసి బుధవారం సాయంత్రం పక్క గ్రామమైన లింగసానిపల్లికి పండుగ కోసమని వెళ్లారు. రాత్రి అక్కడే ఉండి గురువారం ఉదయం తిరిగి ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగలగొట్టి ఉన్నాయి. అనుమానం వచ్చి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళాలు పగలగొట్టి రూ.75 వేల నగదు, మూడు జతల 25 తులాల వెండి గొలుసులు, రెండు జతల బంగారు కమ్మలు, రెండు బంగారు ఉంగరాలు, బంగారు మ్యాట్నీలు దాదాపు రెండు తులాల బంగారంతో పాటు, పిల్లలు దాచుకున్న చిల్లర డబ్బులు కూడా దోచుకెళ్లినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుడు మల్లేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డ్రైవర్‌పై కేసు నమోదు

దేవరకద్ర, ఏప్రిల్ 11 : డ్రైవర్ నిర్లక్ష్యానికి గాను వ్యక్తి ప్రాణాలు కోల్పోవడంతో బాధిత కుటుంబం ఇచ్చిన ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై నాగన్న తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం యాదగిరి జిల్లా గుర్మిట్కల్ మండలం దంతనూరు గ్రామానికి చెందిన శిల్పి రామాచారి బుధవారం రాత్రి తన కారులో డ్రైవర్ రమేష్‌తో కలిసి రాతి బండ కోసం కర్నూల్ జిల్లా ఆళ్లగడ్డకు బయలుదేరాడు. దేవరకద్ర సమీపం వద్ద ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయి దానిని ఢీకొన్నాడు. ప్రమాదంలో రామాచారి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని కుమారుడు శంకరాచారి గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు డ్రైవర్ రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కార్మికుల వేతనాల్లో కోత



కాంట్రాక్టర్‌పై విచారణ జరిపించాలని వైద్య విధాన పరిషత్ జాయింట్ సెక్రటరీ శ్రీదేవికి వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు (ఫైల్)

- కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో కాంట్రాక్టర్ చేతివాటం
- ఒక్కో సెంటర్‌లో ఒక్కో విధంగా వేతనాల చెల్లింపు
- పీఎఫ్, ఈఎస్ఐ చెల్లింపులోనూ గందరగోళం
- సీహెచ్‌సీలలో ప్రభుత్వ నిబంధనలకు తూట్లు
- అన్నీ తెలిసినా మౌనంగా ఉంటున్న అధికారులు

వనపర్తి వైద్యవిభాగం, ఏప్రిల్ 11 : జిల్లాలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో పనిచేస్తున్న శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికుల వేతనాల్లో విపరీతమైన కోతలు పడుతున్నాయి. రేవల్లి, ఘనపురం, ఆత్మకూర్, వీపనగండ్లలో 30 పడకలతో కూడిన కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు వైద్య విధాన పరిషత్ పరిధిలో కొనసాగుతున్నాయి. వీటిలో పని చేసేందుకు శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ విభాగాలతో కలిపి ఒక్కో ఆస్పత్రిలో 14 మంది కార్మికులు ఉండాలి. అందుకోసం గత ప్రభుత్వం సీహెచ్‌సీల నిర్వహణ కోసం వెంకటయ్య సెక్యూరిటీ ఏజెన్సీకి కాంట్రాక్ట్ అప్పగించింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతీ కార్మికుడికి ప్రతీనెల వారి అకౌంట్‌లో రూ.12,093 జమ కావాలి. కానీ ప్రభుత్వ నిబంధనలు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్న సదరు ఏజెన్సీ కాంట్రాక్టర్ కార్మికుల వేతనాల్లో భారీ కోతలు విధిస్తున్నాడు. రేవల్లి సీహెచ్‌సీలో పనిచేస్తున్న కార్మికులకైతే మరీ దారుణంగా వ్యవహరిస్తూ కేవలం ప్రతీనెల రూ.9 వేలు మాత్రమే చెల్లిస్తుండటం విస్మయానికి గురి చేస్తుంది. 30 పడకల ఆస్పత్రిగా ఉన్న రేవల్లి సీహెచ్‌సీని ఇటీవల ప్రభుత్వం 15 పడకల ఆస్పత్రిగా కుదించింది. దీంతో ఇక్కడ ఒక్క కార్మికుడు అధికంగా ఉన్నాడన్న నెపంతో అతి తక్కువ వేతన చెల్లింపు జరుగుతోంది. మిగతా కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ఇటీవలే కొంత వేతనం పెంచి రూ.11 వేలు చెల్లిస్తున్నట్లు సమాచారం.


పీఎఫ్, ఈఎస్ఐలో..

కార్మికుల బేసిక్ శాలరీ రూ.12,093 కాగా, అందుకు విరుద్ధంగా కేవలం రూ.ఆరు వేల నుంచి రూ.6500 చూపిస్తున్న సదరు కాంట్రాక్టర్ వాటిలో 25 శాతం కోత విధిస్తున్నాడు. దీంతో ప్రతీ కార్మికుడికి కేవలం రూ.700 నుంచి రూ.800 వరకు మాత్రమే ప్రతీనెల పీఎఫ్ కట్ అవుతుంది. ఈఎస్ఐ విషయంలో మాత్రం కొంతమంది కార్మికులకు ఈఎస్ఐ నెంబర్ ఇవ్వడం.. మరికొందరికి నేటికీ ఇవ్వకపోవడంతో ఎంత కట్ అవుతుందో కూడా తెలియక కార్మికులు అయోమయానికి గురవుతున్నారు. నిబంధనల ప్రకారమైతే రూ.12,093 బేసిక్ శాలరీలో కార్మికుడి ఖాతా నుంచి 12 శాతం, కాంట్రాక్టర్ 13 శాతం కలిపి పీఎఫ్‌ను ప్రతీనెల జమ చేయాల్సి ఉంటుంది. ఈ లెక్క ప్రకారం ప్రతీ కార్మికుడికి ప్రతీనెల రూ.3,023 పీఎఫ్, రూ.484 ఈఎస్ఐ జమ కావల్సి ఉంటుంది. కానీ ఇవేవీ పట్టించుకోని వెంకటయ్య సెక్యూరిటీ ఏజెన్సీ కంపెనీ కార్మికుల నుంచి ప్రతీనెల వేలల్లో కోతలు విధించి లక్షల రూపాయల కార్మికుల కష్టం వారి జేబుల్లో జమ చేసుకుంటున్నారు.

ఏడు నెలలుగా అందని వేతనాలు

జిల్లాలోని రేవల్లి, ఘనపురం, ఆత్మకూర్, వీపనగండ్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో పనిచేస్తున్న కార్మికులకు గత ఏడు నెలలుగా వేతనాలు అందడం లేదు. ఏప్రిల్ నెలలో ఉగాది, రంజాన్ పండుగలు వరుసగా వస్తున్న తరుణంలో ప్రభుత్వం ఇటీవలే గతనెల 28న బడ్జెట్‌ను రిలీజ్ చేసింది. అయినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కార్మికులు పండుగ పూట పస్తులుండాల్సిన దౌర్భాగ్యం ఏర్పడింది. అగ్రిమెంట్ ప్రకారం అయితే ప్రభుత్వం బడ్జెట్ రిలీజ్ చేయకున్నా సదరు కాంట్రాక్ట్ ఏజెన్సీ వరుసగా మూడు నెలల వేతనం చెల్లించేలా ఒప్పందం ఉంటుంది. అయినప్పటికీ కార్మికులకు మాత్రం ఏడు నెలలుగా వేతనాలు అందడం లేదు. అంతేకాకుండా మెయింటెనెన్స్ ఖర్చు విషయంలో కూడా కాంట్రాక్టర్ చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. వంద పడకలకు గాను ప్రభుత్వం మెయింటెనెన్స్ కోసమని ప్రతీనెల రూ.20 వేలు చెల్లిస్తూ ఐదు శాతం కమీషన్ కూడా ఇస్తుంది. కానీ ఏజెన్సీ నిర్వాకం కారణంగా కార్మికులు తమ ఇంటి నుంచి చీపుర్లు తెచ్చుకుని ఆస్పత్రిని శుభ్రం చేస్తున్నారు. ప్రతీ మూడు నెలలకు ఒక్కసారి మాత్రం రెండు లీటర్ల ఫినాయిల్ ఇవ్వడంతో అది ఏమూలకు సరిపోవడంలేదు. ఈ విధంగా కార్మికుల వేతనాల్లో, పీఎఫ్, ఈఎస్ఐ చెల్లింపులో కాంట్రాక్టర్ అవినీతికి పాల్పడుతున్నట్లు సమాచారం. వీటిపై పూర్తిగా విచారణ జరిపిస్తే అవినీతి భాగోతం మరింత బయటపడే అవకాశం ఉంటుంది.

కార్మికుల కష్టం దోపిడీ చేస్తున్నారు..



కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో పనిచేస్తున్న కార్మికుల కష్టాన్ని వెంకటయ్య సెక్యూరిటీ సర్వీసెస్ ఏజెన్సీ వారు లక్షల్లో దండుకుంటున్నారు. కార్మికులకు ప్రతీనెల సరైన వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించడం లేదు. మెయింటెనెన్స్ కూడా సక్రమంగా లేకపోవడంతో కార్మికులే చీపుర్లు తెచ్చుకుని ఆస్పత్రులను శుభ్రం చేస్తున్నారు. డీసీహెచ్‌ఎస్, వైద్య విధాన పరిషత్ అధికారులకు వీటిపై అనేకసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోతోంది. బడ్జెట్ రిలీజ్ అయినప్పటికీ కార్మికులు పండుగ పూట వేతనాలు లేకుండా ఉన్నారంటే దానికి అధికారుల నిర్లక్ష్యమే ప్రధాన కారణం. బిల్లులు చేయకుండా, చెక్కులు ఇవ్వకుండా ఉండటం వల్ల కార్మికులకు పండుగ పూట వేతనాలు అందలేదు. కార్మికులకు న్యాయం జరిగేవరకు వారి పక్షాన పోరాటం కొనసాగిస్తాం.

- సురేష్, మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి

యువత క్రీడల్లో రాణించాలి

- మంత్రి జూపల్లి కృష్ణారావు



వెన్నచర్లలో కబడ్డీ క్రీడాకారులతో మంత్రి జూపల్లి కృష్ణారావు

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 11 : గ్రామీణ ప్రాంతాల్లోని యువత క్రీడల్లో రాణించాలని సాంస్కృతిక పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఉగాది పండుగను పురస్కరించుకొని మండలంలోని వెన్నచర్లలో ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ దాత సహకారంతో రెండు రోజుల పాటు నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొని క్రీడాకారులను పరచయం చేసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీర ధృఢత్వాని పెంపొందిస్తాయన్నారు. యువత గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు క్రీడల్లో ఎదగాలని ఆయన యువతను కోరారు. గ్రామానికి జిల్లాకు రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం కబడ్డీ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ నాగర్‌కర్నూల్ జట్టుకు ప్రథమ బహుమతి రూ.20 వేలు, వెన్నచర్ల జట్టుకు రెండవ బహుమతిగా రూ.15 వేలు, నాగర్‌కర్నూల్ మిషన్ జట్టుకు మూడవ బహుమతిగా రూ.10 వేలు, నాల్గవ బహుమతి ముద్దునూర్ జట్టుకు రూ.5 వేల నగదుతో పాటు షీల్డ్‌లు అందజేశారు. జడ్పీటీసీ సభ్యురాలు మేకల గౌరమ్మ, ఎంపీటీసీ సభ్యుడు రవికుమార్, సింగిల్ విండో మాజీ చైర్మన్ బాలస్వామి, నాయకులు మేకల చంద్రయ్య, పర్వతాలు, బాలింగాచారి, రాముడు, జంగం పెదరాజు, రాంప్రసాద్, నాగేంద్రం, శంకర్, శ్రీనివాస్ యాదవ్, క్రీడా నిర్వాహకులు ఉదయ్ కుమార్, కురుమయ్య, దామోదర్, రమేష్, కార్తీక్, శ్రీశైలం, కతాల్ లింగస్వామి తదితరులు ఉన్నారు.

రైతు వ్యతిరేక మోదీ ప్రభుత్వాన్ని ఓడించండి



ఏఐకేఎస్ జెండాను ఎగురవేస్తున్న తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసులు

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 11: కేంద్రంలోని రైతు వ్యతిరేక మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలో అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) 89వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన ఏఐకేఎస్ జెండాను రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసులు ఎగురవేశారు. రైతు సంఘం నాయకులు వెంకటేష్, పర్వతాలు, అశోక్, నరేందర్‌రెడ్డి, కృష్ణమ్మ, సత్యం, శ్రీనివాసులు, కాశన్న పాల్గొన్నారు.

ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు గుణపాఠం తప్పదు

● ఎంపీ పోతుగంటి రాములు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పోతుగంటి రాములు

చారకొండ, ఏప్రిల్ 11: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు తగిన గుణపాఠం తప్పదని నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అన్నారు. గురువారం మండల పరిధిలోని సిర్సనగండ్లలో బీజేపీ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన సమావేశానికి ఎంపీ రాములు, జాతీయ బీసీ కమిషన్ సభ్యుడు తల్లోజు ఆచారి, నాగర్‌కర్నూల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్‌లు హాజరయ్యారు. సిర్సనగండ్లలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా ఎంపీ రాములు, తల్లోజు ఆచారి మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చేసిన మోసాలను పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అభ్యర్థి గెలుపుకోసం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి అభివృద్ధికి పాటుబడాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సిర్సనగండ్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు 50 మంది నారాయణ్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. అంతకుముందు మండలంలోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి రాములు, ఆచారి, భరత్‌ప్రసాద్ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి కృష్ణ, ఉపాధ్యక్షుడు శ్రీనుయాదవ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు రవినాయక్, నాయకులు చంద్రయ్య, ఎల్లయ్య, సత్తిరెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, పుల్లారెడ్డి, శ్రీకాంత్, రామస్వామి, విజేందర్‌రెడ్డి, అంజయ్య ఈదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటరు లిస్టులో పేర్లు తొలగించడం న్యాయం కాదు

- ఎన్నికల నిర్వహణాధికారి దీపక్ కుమార్‌కు ఫిర్యాదు



దీపక్ కుమార్‌తో మాట్లాడుతున్న ముత్తిరెడ్డిపల్లి గ్రామస్థులు

కోడేరు, ఏప్రిల్ 11 : ఎన్నికల ఓటరు లిస్టులో నుంచి తమ పేర్లను తొలగించడం న్యాయం కాదని బ్రతికి ఉండగానే మాకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తొలగించడం న్యాయం కాదని మండలంలోని ముత్తిరెడ్డిపల్లి గ్రామస్థులు ఎన్నికల నిర్వహణాధికారి, జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. గురువారం ఆయన కోడేరు తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన సందర్భంగా ముత్తిరెడ్డిపల్లి గ్రామస్తులు ఆయనతో ముఖాముఖి మాట్లాడి ఓటర్ల లిస్టు నుంచి ఓటర్ల పేర్లను తొలగించిన విషయం తెలుపుతూ అందుకు సంబంధించిన సమాచారం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మెసలి భాస్కర్, మాజీ సర్పంచ్ అంజన్ గౌడ్, కె.శ్రీనివాస్ రెడ్డిలు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో తమ ఓటును వినియోగించుకున్నామని, డిసెంబర్ 8న దరఖాస్తు చేసి అదేనెల డిసెంబర్ 23న ఒకే రోజు 115 మంది పేర్లను ఓటరు లిస్టులో తొలగించారని తెలిపారు. ఓటర్లకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అక్రమంగా తొలగించడం న్యాయమా అన్నారు. బ్రతికి ఉండగా ఓటరు జాబితా నుంచి పేర్లను తొలగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని తమ పేర్లను ఓటరు జాబితాలో చేర్చాలని కోరారు. అందుకు అన్ని విషయాలు పరిశీలించి చర్యలు తీసుకుంటానని ఆయన అన్నారు.

రేపు వట్టెంలో వైద్య శిబిరం

బిజినేపల్లి, ఏప్రిల్ 11 : మండలంలోని వట్టెం గ్రామంలో శనివారం సందడి కిష్టమ్మ, రాఘవరెడ్డి మెమోరియల్ ట్రస్టు, యశోద హాస్పిటల్స్ సంయుక్తంగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్టు నిర్వాహకులు సందడి ప్రతాప్ రెడ్డి, సందడి నరేందర్ రెడ్డి గురువారం తెలిపారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్స్‌లోని అన్ని రకాల వైద్య నిపుణులచే నిర్వహించే ఈ మెగా వైద్య శిబిరాన్ని పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో వినియోగించుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో

ఈద్-ఉల్-ఫితర్

రంజాన్ వేడుకలను గురువారం ముస్లింలు జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ పర్వదినాన కొత్త దుస్తులు ధరించి, బంధుమిత్రులతో ఉల్లాసంగా, ఆనందంతో గడిపారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రాజకీయ నాయకులు, అధికారులు ఈద్గాల వద్దకు వెళ్లి ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.



నాగర్‌కర్నూల్‌లో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

- ఈద్గాల వద్ద ముస్లింల ప్రత్యేక నమాజ్

- నాగర్‌కర్నూల్‌లో ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 11: రంజాన్ పర్వదిన వేడుకలను గురువారం జిల్లా వ్యాప్తంగా ముస్లింలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డులో ఈద్గా వద్దకు ముస్లింలు అధిక సంఖ్యలో చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఈ సందర్భంగా జామియా నిజామీయాకు చెందిన అలిం, జామియా మజీద్ ఖతీబ్ హఫీజ్ షాకీర్ సిద్దిఖీ, హఫీజ్ మహబూబ్ అలీలు రంజాన్ ప్రాముఖ్య తను వివరిం చారు. ముస్లింలకు అల్లా భక్తులకు ప్రసాదిం చిన ఐదు అంశాలలో రోజా కూడా ప్రధానమైనదన్నారు. రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు చేసిన వారు వివిధ కారణాల వల్ల దీక్షలో పాల్గొనని వారు స్వచ్ఛమైన మనసుతో రంజాన్ నెల ప్రాముఖ్యతను గుర్తించి నడిచిన వారు అల్లా కృపకు పాత్రులు అవుతారన్నారు. ఈదుల్ ఫితర్ ప్రత్యేక నమాజును జామియా నిజామీయాకు చెందిన హఫీజ్ అన్వరల్ హక్ చదివించగా, జామై మజీద్ షాహీ ఇమామ్ అబ్దుల్ హక్ ఖుద్బాతో పాటు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జామియా మజీద్ అధ్యక్షుడు జైనుల్లా బొద్దీన్, వక్ఫ్ కాంప్లెక్స్ కార్యదర్శి అబ్దుల్లాఖాన్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో నాగర్‌కర్నూల్ పట్టణ ప్రజలు సహకరించడం వల్ల అన్ని మజీద్‌ల్లో రంజాన్ ఏర్పాట్లు ఘనంగా జరిగాయని పేర్కొన్నారు. అనంతరం ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈద్గా వద్దకు వివిధ పార్టీలకు చెందిన ప్రముఖులు చేరుకుని ప్రార్థనల అనంతరం ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

● ముస్లింలకు ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి శుభాకాంక్షలు

నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి జిల్లా కేంద్రంలోని ఈద్గా వద్ద ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలను ఆలింగనం చేసుకుంటూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు ఉన్నారు. అదేవిధంగా బీఆర్ఎస్ నాయుకుడు నాగం శశిధర్‌రెడ్డి తమ పార్టీ నాయకులతో కలిసి ఈద్గా వద్ద ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

● అచ్చంపేట: ముస్లిం పవిత్ర రంజాన్ పండుగను భక్తి శ్రద్ధలతో గురువారం ముస్లింలు జరుపుకున్నారు. పట్టణంలోని ఈద్గా వద్ద ముస్లింలు ఉదయం చేరుకొని ప్రార్థనలు చేశారు. ప్రార్థనలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లను చేశారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ప్రార్థనల అనంతరం ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఈద్గా వద్దకు చేరుకొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

● పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్, కొందూర్, పెంట్లవెల్లి తదితర గ్రామాల్లో రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలు పెంట్లవెల్లి నుంచి నమాజ్ కట్ట వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ ఏర్పాటు చేసిన దర్గా దగ్గర ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికి ఒకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముస్లింలు మతీన్‌అహ్మద్, ఖాజామోహినోద్దిన్, రఫియొద్దీన్, అబ్దుల్లా, ముబిన్ తదితరులు పాల్గొన్నారు.

● బిజినేపల్లి: రంజాన్ వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని బిజినేపల్లి, పాలెం, గంగారం, మంగనూర్, ఖానాపూర్, వడ్డేమాన్, వట్టెం, గౌరారం తదితర గ్రామాల్లో గురువారం ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, పాలెం మాజీ సర్పంచ్ నాగరాజు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

● పెద్దకొత్తపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో ముస్లింలు రంజాన్ వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. గురువారం పెద్దకొత్తపల్లి, పెద్ద కారుపాముల, వెన్నచర్ల, చంద్రకల్, ముష్టిపల్లి, యాపట్ల, మరికల్, చిన్న కారుపాముల, సాతాపూర్, కల్వకోల్ తదితర గ్రామాల్లో ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వేడుకల్లో ఎంపీపీ సూర్యప్రతాప్ గౌడ్, జడ్పీటీసీ సభ్యురాలు మేకల గౌరమ్మ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈద్గాల వద్ద ప్రార్థనలు చేసిన వారిలో మంత్రి జూపల్లి కృష్ణారావు, పీవీ నిరంజన్, సుల్తాన్, ఖాజా, సలీం, బాబు బసీరుద్దీన్, మైను, బాలపీరు, మహమ్మద్, జాంగీర్ తదితరులు ఉన్నారు.

● అమ్రాబాద్: మండల కేంద్రంలోని ఈద్గా వద్దకు మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన ముస్లింలు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలకు వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజా ప్రతినిధులు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం మత పెద్దలు నాయక్ సర్దార్, పయాజ్ అలీ, జమీల్ పాల్గొన్నారు.

● ఊర్కొండ: మండల కేంద్రంతో పాటు ఊర్కొండపేట, జకినాలపల్లి, జగబోయినపల్లి, మాదారం, రేవల్లి, తదితర గ్రామాల్లో ఈద్-ఉల్-ఫితర్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని ఈద్గాల వద్ద చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండల కోఆప్షన్ మెంబర్ కలీమ్ పాషా, జిల్లా మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సమి, నాయకులు మహ్మద్ ఖాజా, మహ్మద్ జహంగీర్, సయ్యద్ షర్పుద్దీన్ షబ్బీర్, బారి రషీద్, ఫరీద్, ఆయూబ్ పాష, పాషా తదితరులు పాల్గొన్నారు.

● వెల్దండ: పవిత్ర రంజాన్ పర్వదినాన్ని మండలంలోని వెల్దండ, పోతేపల్లి, లింగారెడ్డిపల్లి, కొట్ర గ్రామాల్లో గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలోని మసీద్‌లు, ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. లింగారెడ్డిపల్లి, వెల్దండ గ్రామాల్లో ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, జిల్లాపరిషత్ వైఎస్ చైర్మన్ బాలాజీసింగ్, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డిలు రంజాన్ వేడుకలో పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్‌లు వెంకటయ్యగౌడ్, సంజీవ్‌కుమార్, నాయకులు యాఖూబ్, రహమాన్, హుస్సేన్, రషీద్, హలీం, జంగిలి యాదగిరి, సాదిక్, హమీద్, సమీర్‌బాబా, సద్దాం, వలీ, అలీ తదితరులు ఉన్నారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్

కల్వకుర్తి: మతసామరస్యానికి రంజాన్ పండుగ ప్రతీకగా నిలుస్తుందని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయిక రంజాన్ మాసాన్ని ముస్లింలు ఎంతో పవిత్రంగా జరుపుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలో రంజాన్ పండుగను పురస్కరించుకుని గురువారం ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలకు ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, జడ్పీ వైస్‌చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, జే చిత్తరంజన్‌దాస్, మాజీ సర్పంచులు బ్యాంగి ఆనంద్‌కుమార్, పసుల సుదర్శన్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ యడ్మ సత్యం, మాజీ చైర్మన్ రాచోటి శ్రీశైలం రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేయనున్నట్లు తెలిపారు. రంజాన్ పండుగ నేపథ్యంలో ఎలాంటి ఆటంకాలు జరుగకుండా కల్వకుర్తి సీఐ పి. నాగర్జున, ఎస్ఐ జి. మాధవరెడ్డిల ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. అదేవిధంగా కల్వకుర్తి పట్టణంలోని పలువురు ముస్లింలను వారి ఇంటివద్ద ఎమ్మెల్యే కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి, రమకాంత్‌రెడ్డి, మిర్యాల దామోదర్‌రెడ్డి, జిల్లెల రాములు, శ్రీకాంత్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, మిరియాల శ్రీనివాస్‌రెడ్డి, ఎజాస్, శ్రీనివాస్, సంతుయాదవ్, శేఖర్, సైదులుయాదవ్, నాని, వెంకటేష్, సురేష్, బీఆర్ఎస్ నాయకులు విజయ్‌గౌడ్, గోవర్ధన్, జంగయ్య, సూర్యప్రకాష్‌రావు, భోజిరెడ్డి, సైదులుగౌడ్, నేరటి శేఖర్, సూరి తదితరులు పాల్గొన్నారు.

● చారకొండ : చారకొండతో పాటు మండలంలోని జూపల్లి, తుర్కలపల్లి తదితర గ్రామాల్లో నెల రోజుల పాటు ఉపవాస దీక్షను కొనసాగించిన ముస్లింలు గురువారం ప్రత్యేక పార్థనలతో రంజాన్ వేడుకలను భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. చారకొండ, జూపల్లిలో ఉదయాన్నే ముస్లింలు ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జూపల్లిలో ముస్లిం పెద్దలకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జూపల్లి వెంకటయ్యయాదవ్ రంజాన్ పండుగ శుభకాంక్షలు తెలిపారు. మండల కేంద్రంలో ముస్లింలకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జమ్మికింది బాల్‌రాంగౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పానుగంటి అంజయ్య ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలు ముస్తఫము జ్జుబాయి, బాలెమియ, మండల కో-ఆప్షన్ సభ్యుడు సలీం, రషీద్, హజిమ్, అగ్రం, కమాల్, నిరంజన్, యూసుఫ్, హరిఫ్, హుసేన్, సీరాజ్, హస్లాం పాల్గొన్నారు.

● కోడేరు: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో రంజాన్ పర్వదిన వేడుకలను ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి హిందువులు, ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సింగిల్ విండో డైరెక్టర్ మహేశ్వర్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు నరసింహ, ప్రవీణ్ రావు, బాలపీరు ఉన్నారు.

● మన్ననూర్: అమ్రాబాద్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో రంజాన్ పండుగను ముస్లింలు గురువారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఉపవాస దీక్షలు బుధవారం ముగియడంతో గురువారం ఉదయాన్నే జామే మసీదులో ముస్లింలు ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లింలు స్థానిక ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మసీదు కమిటీ అధ్యక్షుడు నసీరోద్దీన్, మైనార్టీ నాయకులు రహీమ్, రహమాన్, అజ్మత్, సాజన్, జహంగీర్ అలి, హిదాయత్, బాబలి, వాజిద్ అలి , ఖాజ, జావేద్, జమాల్ తదితరులు పాల్గొన్నారు.



ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు



కల్వకుర్తిలో ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్, మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం

ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి జూపల్లి

కొల్లాపూర్, ఏప్రిల్ 11: పవిత్ర రంజాన్ మాసంలో నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు పూని ప్రపంచ శాంతితో వర్ధిల్లాలని కోరిన ముస్లింలకు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, పురావస్తుశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కొల్లాపూర్ పట్టణంలోని ఖాదర్ పాషా దర్గా సమీపంలో ఉన్న ఈద్గా వద్ద ఈద్-ఉల్-ఫితర్ వేడుకల్లో భాగంగా ముస్లింలు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈద్గా వద్ద ముస్లిం మత పెద్దలు రంజాన్ నెల విశిష్టతను వివరించారు. వేడుకల్లో మంత్రి జూపల్లి పాల్గొని ముస్లిం మత పెద్దలకు శాలువా పూల మాలలతో సన్మానించారు. అనంతరం ముస్లిం మత గురువు హఫీజ్ హాశీం సుత్తారిని సన్మానించి సోదరులను ఆలింగనం చేసుకుని ఆత్మీయంగా పలకిరిస్తూ మంత్రి ఈద్-ఉల్-ఫితర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని, అల్లా దయతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అన్ని వర్గాల పండుగలను అధికారికంగా నిర్వహిస్తోందని, తెలంగాణ రాష్ట్రం సర్వమత సామరస్యంతో ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, కౌన్సిలర్లు, నాయకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కొల్లాపూర్‌లో మంత్రి జూపల్లిని సన్మానిస్తున్న ముస్లిం మత పెద్దలు

ఘనంగా మహాత్మా జ్యోతిబా పూలే జయంతి

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 11: సామాజిక సంస్కర్త మహాత్మా జ్యోతిబా పూలే జయంతిని గురువారం జిల్లా కేంద్రంలో పలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన పూలే చిత్ర పటానికి ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో గౌతమ బుద్ధుడి తర్వాత సాంస్కృతిక, సామాజిక సమానత్వ విప్లవానికి నాంది పలికిన దార్శనికుడు మహాత్మా జ్యోతిబా పూలే అన్నారు. సత్యశోధక్ సమాజాన్ని స్థాపించి అణిచివేతకు గురైన బహుజనులకు జ్ఞానం అందించిన మహోన్నతుడని కొనియాడారు. పూలే ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు వెంకటశెట్టి, సాయిరెడ్డి, ప్రభాకర్, శ్రీనివాసులు, బాలస్వామి, నరసింహగౌడ్, బుచ్చన్న, కృష్ణయ్య, పోల శ్రీనివాసులు పాల్గొన్నారు.

● అంబేడ్కర్ ఐడియాలజీ మిషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో ఏర్పాటు చేసిన పూలే చిత్ర పటానికి ఆ సంఘం అధ్యక్షుడు తలారి మద్దిలేటి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మిషన్ సభ్యులు మద్దిలేటి, చంద్రయ్య, వెంకటస్వామి, శోభన్, చెన్నయ్య, గోవర్ధన్, రాము, వినోద్, రవి, రామకృష్ణ, తిరుపతయ్య, రాములు, కోటేశ్వర్, క్రాంతి, సింగోటి, కృష్ణ, వెంకటేశ్, నవీన్, సుధాకర్, కృష్ణప్రసాద్, చిన్నమద్దిలేటి, సాయిబాబు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

● కేవీపీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్సీ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన పూలే చిత్ర పటానికి ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కేవీపీఎస్ నాయకులు కొత్త శివకుమార్, శ్రీనివాసులు, రాములు, చంద్రయ్య, బంగారయ్య, భానుప్రకాష్ పాల్గొన్నారు.

● టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలోని జాతీయోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పూలే చిత్ర పటానికి ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎన్.చంద్రశేఖర్ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు తిరుపతయ్య, రామకృష్ణ, చంద్రమోహన్‌రెడ్డి, కుర్మయ్య శేషగిరి, కృష్ణమోహన్, కోటేశ్, సింగోటి, కృష్ణ, ఆర్.సత్యం, లక్ష్మణ్ పాల్గొన్నారు.

● ధర్మ టీచర్స్ యూనియన్ ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డుకాలనీ చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన పూలే చిత్ర పటానికి ఆ సంఘం జిల్లా కన్వీనర్ జానయ్య పూల మాల వేసి నివాళులు అర్పించారు.

యూనియన్ నాయకులు వంకేశ్వరం నిరంజన్, గుడిపల్లి నిరంజన్, పెబ్బేటి మల్లికార్జున్, తిరుపతయ్య, విష్ణు, సైదులు, అర్జున్, కృష్ణ భాస్కర్‌గౌడ్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఉద్యమ కెరటంగా ఎదిగిన పూలే

అచ్చంపేట: సామాన్యుడిగా మొదలై సామాజిక ఉద్యమ కెరటంగా ఎదిగిన మహోన్నతమైన వ్యక్తి మహాత్మా జ్యోతిరావు పూలే అని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ఆయన జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సీనియర్ నాయకులు మోపతయ్య, రాజేందర్, కౌన్సిలర్లు శ్రీనివాసులు, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.



పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

● బిజినేపల్లి: మహాత్మ జ్యోతిబా పూలే సామాజిక చైతన్య మూర్తి అని ఎంపీటీసీల సంఘం జిల్లా కన్వీనర్ మంగి విజయ్ అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో గురువారం జ్యోతిబా పూలే చిత్ర పటానికి పూలమాల వేసి, కేక్ కట్ చేసి పూలే 198వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి మాట్లాడారు. వివిధ కుల సంఘాల నాయకులు చీర్ల బాలస్వామి, ఊర్కొండ రఘుబాబు, గంగనమోని రాములు, భూషయ్య, నరేందర్ గౌడ్, చంద్రగౌడ్, భగవంత్ గౌడ్, ఇగురబంద శ్రీనివాసులు, పరుశరాములు, మొల్గర రాములు, విజయ్ కాంత్, కాళిదాసు, నరిగె ఊశన్న, చెన్నయ్య ఎల్లస్వామి, శివయ్య యాదవ్ తదితరులు ఉన్నారు.

● పెద్దకొత్తపల్లి: మండలంలోని ముస్టిపల్లిలో పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని బస్టాండ్ అవరణలో పూలే చిత్రపటానికి గురువారం పలువురు పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఎం.తిరుపతయ్య, పి.నరసింహ, రాముడు, అశోక్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

● అమ్రాబాద్: మహాత్మా జ్యోతిబాపూలే జయంతి కార్యక్రమాన్ని గురువారం పదర మండల కేంద్రంలో బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు డేగ అనిల్ కుమార్, వివిధ పార్టీల నాయకులు రామలింగయ్య యాదవ్, ప్రవీణ్ కుమార్, ఆనంద్, ప్రశాంత్ చారి, ఆనంద్ కుమార్, వెంకటయ్య, రాజు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ: జ్యోతిరావ్ పూలే జయంతిని మండలకేంద్రంలో కాంగ్రెస్‌పార్టీ, ముదిరాజ్‌సంఘం ఆధ్వర్యంలో గురువారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాల వేసి నాయకులు నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్‌లు వెంకటయ్యగౌడ్, శేఖర్ నాయకులు పర్వత్‌రెడ్డి, ముదిరాజ్‌సంఘం అధ్యక్షుడు మల్లేష్, ఎర్రశ్రీను, కృష్ణముదిరాజ్, పుల్లయ్య ఉన్నారు.

● పెంట్లవెల్లి: జ్యోతిరావు పూలే ఆశయాలతో సామాజిక పోరాటాలు నిర్వహిస్తాం అని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ అన్నారు. గురువారం మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. గ్రామపంచాయతీ సిబ్బంది చిట్టెమ్మ, తిమ్మస్వామి, గోవిందు, పెంటయ్య, శ్రీనువాసులు, చందు తదితరులు పాల్గొన్నారు.

పూలే ఆశయాలను కొనసాగిద్దాం

కల్వకుర్తి: ప్రముఖ సంఘ సంస్కర్త సమాజంలో అంతరాలను రూపుమాపేందుకు జీవితాంతం పరితపించిన మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను కొనసాగిద్దామని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు పూలే జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. జడ్పీ వైస్‌చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, మునిసిపల్ చైర్మన్ యడ్మ సత్యం, మాజీ సర్పంచ్ బ్యాంగి ఆనంద్‌కుమార్, నాయకులు రాజేందర్, పెద్దయ్య యాదవ్, విజయ్‌గౌడ్, రమేష్‌చారి, సదానందంగౌడ్, రమకాంత్‌రెడ్డి, రాములు, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, శ్రీను, ఈశ్వరయ్య, శ్రీనివాసులు, సైదులు, శేఖర్, పలు కులాల సంఘాల, బహుజన సంఘాల నాయకులుతదితరులు పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్‌లో పూలే చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న అంబేద్కర్ ఐడియాలజీ మిషన్ సభ్యులు

● కేవీపీఎస్ ఆధ్వర్యంలో..

కేవిపీఎస్ ఆధ్వర్యంలో కల్వకుర్తి పట్టణంలోని సీఐటీయూ భవనంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పులిజాల పరుశరాములు ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా జరుపుకున్నారు. జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, యూటీఎఫ్ సీనియర్ నాయకులు ఏపీ మల్లయ్య, వంగూరు మండల యూటీఎఫ్ అధ్యక్షుడు నరసింహులు, యూటీఎఫ్ నాయకులు శ్రీశైలం, నాయీ బ్రాహ్మణసంఘం నాయకులు, కేవీపీఎస్ జిల్లా నాయకులు జగన్, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

● ఊర్కొండ: మండలంలోని గుడిగానిపల్లి గ్రామంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. మాజీ సర్పంచ్ రజిత, గ్రామస్థులు జంగయ్యమాదిగ, కృష్ణయ్య తిరుపతయ్య, కృష్ణారెడ్డి, శ్రీపతి, జంగయ్య, రమేష్, ఈదయ్య, వెంకటేష్ తదితరులు ఉన్నారు.



కల్వకుర్తిలో మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి